# వెండితెర వెనుక
## సత్తిబాబు



గత ౩౫ సంవత్సరాలుగా తెలుగు సినీరంగంలో దర్శకత్వశాఖలో విశేషమైన అనుభవం ఉన్న రచయిత కలం నుంచీ

1978 ప్రాంతాల్లో మద్రాసులోని తెలుగు చలనచిత్ర రంగానికి అద్దం పట్టే ధారావాహిక నవల.

*(గతసంచిక తరువాయి..)*

9

నేను గేటు తెరిచి లోపలికి అడుగు పెడుతుంటే, పాలవాడు పాలు పోసి వెళుతున్నాడు. పాలగిన్నె లోపలకు తీసుకువెళుతున్న మా ఇల్లు గల వాళ్ళమ్మాయి ఆగి, "రాత్రంతా ఎక్కడ తిరిగొచ్చారు" అని అడిగింది.

నేనేం సమాధానం చెప్పలేదు.

"తప్పుకదూ" అంది.

నోరు తెరిచి సమాధానం చెప్పేలోగా లోపలికి వెళ్ళిపోయింది. నా బుర్రకేం ఎక్కలేదు. అచేతనంగా మెట్లెక్కి రూమ్‌లో కొచ్చి పక్కమీద పడ్డాను. వెంటనే నిద్రపట్టేసింది.

✡✡✡

తలుపులు దబదబ మోగుతుంటే, బద్ధకంగా లేచి తలుపు తీసాను! డైరెక్టర్ శంకరంగారు!...

"రండి సార్... రండి.. కూర్చోండి" అన్నాను.

ఆయన రూమంతా చూసి, "రాత్రి పార్టీ బాగానే జరిగినట్టుందే" అన్నారు.

"సారీ సర్"

'భలేవాడివి! నేనేమన్నా మడికట్టుక్కూర్చున్నానా!" అన్నారు.

గబగబా ఆకులు, ఖాళీ సీసాలు తీసి డస్ట్ బిన్‌లో పడేసి, "ఛైర్స్ లేవు సార్! ఈ బెడ్‌నే మీరు అన్నీ అనుకోవాలి" అన్నాను.

"కనీసం బెడ్ అయినా కొన్నావు! ఇది మాత్రం అమ్మకేం" అని గట్టిగా నవ్వారు.

నేను నవ్వాను.

"నువ్వు కూర్చో" అని ప్రక్కకి జరిగారు. ప్రక్కనే కూర్చున్నాను.

"ఏమన్నా పిక్చర్లు ఒప్పుకున్నావా రంగబాబు` అని అడిగారు.

"లేదు సార్! ప్రస్తుతం ఖాళీ"

"వచ్చే నెలనుండీ మన పిక్చర్ స్టార్ట్ కాబోతుంది! కొత్త పార్టీ మంచి ఎమౌంట్ ఇప్పిస్తాను. నీకేమన్నా అభ్యంతరమా?"....

"అభ్యంతరం ఏంటి సార్! మీరు గురువులాంటివారు! ఎవరితోనన్నా కబురు చేస్తే నేనే మీ దగ్గరకొచ్చేవాణ్ణి" అన్నాను.

"నువ్వేం మారలేదు రంగబాబూ! అప్పుడెలా ఉన్నావో ఇప్పుడూ అలాగే ఉన్నావు"

"అవును సార్! నా పొజిషన్ కూడా ఏమీ మారలేదు. అప్పుడూ క్రిందే పడుకునేవాణ్ణి, ఇప్పుడూ క్రిందే పడుకుంటున్నాను. అయితే అప్పుడు చాపమీద పడుకుంటే ఇప్పుడు బెడ్‌మీద పడుకుంటున్నాను."

"నీలాంటి టాలెంటెడ్‌కి గుర్తింపు లేదు రంగబాబు! దీనికి కారణం గుర్తించావా!"

"లేదు సార్"

"నువ్వు ఏ బిజీ డైరెక్టర్ గ్రూప్‌లోనో ఉంటే నీకు పిక్చర్ తర్వాత పిక్చర్ ఉండేది! నువ్వు పెద్ద డైరెక్టర్లందరి దగ్గరా పనిచేసావు! అన్ని గ్రూపులనుండీ బయటికొచ్చావు. దీనివల్ల కష్టాలొక్కటే మిగుల్చుకున్నావు."

"కష్టాలు పడ్డా నా వ్యక్తిత్వం కోల్పోలేదని చాలా సంతృప్తిగా ఉందిసార్"

.............

"డైరెక్టర్ మొదటి పిక్చర్లో తన అసిస్టెంట్స్‌తో ఎంత ఫ్రీగా ఉంటాడో - అంత ఫ్రీగా బిజీ అయిన తర్వాత కూడా ఉంటున్నాడా సార్"....

"అది వ్యక్తుల మీద ఆధారపడి ఉంటుంది రంగబాబు!"

"అందుకే నా భావాలక్కూడా విలువిచ్చే వ్యక్తి దగ్గర పనిచెయ్యడం నాకిష్టం సార్! ఆ డైరెక్టర్ బిజీ డైరెక్టర్ కాకపోయినా ఫర్వాలేదు. తను సంవత్సరానికి ఒక్క పిక్చరే చెయ్యొచ్చు"

..................

"ఈ రోజు మీరు నా రూముకి రావాల్సిన అవసరంలేదు. అయినా ఏ ఫీలింగ్ లేకుండా............"

"నేను ప్రస్తుతం బిజీ డైరెక్టర్ని కాదుగా!"

"మీరు బిజీ అయినా మారరు సార్! మీరు వ్యక్తిత్వం ఉన్న మనుషులు - ఎదుటివాడి వ్యక్తిత్వపు విలువలు తెలుసు."

"సర్లే, రంగబాబూ - అవన్నీ ఇప్పుడెందుకు"

"నేనేదో కాకా పడుతున్నానని అనుకోవద్దు సార్! ఉన్న నిజం చెప్పాను. మొదటినుంచీ మీరంటే నా కెంతో అభిమానం! మీరు అసోసియేట్‌గా ఉన్నప్పుడు - అప్రెంటిస్‌గా చేరాను. నన్ను ఆదరంగా దగ్గరకు తీసుకుని, ఆప్యాయంగా ఎన్నో నేర్పారు. మీ దగ్గరే నేను అసిస్టెంట్ అయాను. మీరు డైరెక్టరు అయినప్పుడూ, మొదటిసారిగా మీ దగ్గరే అసోసియేట్‌గా చేసాను. బస్ చార్జీలకి మీ దగ్గర డబ్బు తీసుకున్న రోజులు నేనింకా మరచిపోలేదు సార్! మీరిచ్చిన చొరవ వల్లే టెక్నిక్ తెలుసుకుని, నేనెక్కువ పిక్చర్లు చెయ్యకపోయినా, ఫీల్డులో నా స్థానం పోగొట్టుకోకుండా నిలబడ్డాను. మీ గురించి మీ దగ్గర చెప్పకూడదు! బయట బాజా వాయించాలంటే నాకున్న స్నేహితులు బహు తక్కువ! మీలో ఇంత కెపాసిటీ ఉండి... ఫీల్డ్‌లో ఉంటూ కూడా ఎక్కడో దూరతీరాల్లో ఉంటున్నట్టు"... ఆ తర్వాత నాకెందుకో మాట పెగల్లేదు.

శంకరం గారు నా ముఖంలోకి తదేకంగా చూసి, చిరునవ్వు నవ్వి, భుజం నిమురుతూ, " నాగురించి ఎందుకంత ఎగ్జైట్ అవుతావు రంగబాబు! ఏ మనిషి కన్నా అవకాశం తలుపు తడుతట్టడమే కాదు. కాలు లోపల పెట్టాలి! ఆనాడే విలువలు తెలుస్తాయి.

ఒకనాడు ఎన్నో ఆశయాలు గుండెలనిండా నింపుకుని, సాంఘిక సమస్యల మీద సినిమాలు తీస్తూ - కొత్తదనం ప్రజలకి అందివ్వాలనే తపనతో వచ్చాను. తపన, తపనగానే ఉండిపోయింది. సందేశాల స్థానంలో - జీవితం మీదే సందేహం కలగడం మొదలైంది! అయినా చావని తపన మూలంగా, క్రింద పడుతున్నా - తిరిగి లేచి నిలబడ్డానికి, ప్రయత్నిస్తూనే ఉన్నా! సరైన అవకాశం రాకపోయినా, దేవుడి దయవల్ల కుటుంబం భోజనానికి లోటులేకుండా జరిగిపోతోంది ప్రస్తుతం, అది మాత్రం ఒక వరం కాదంటారా?...

గొంతు పెగుల్చుకుని "మీ ఇన్నాళ్ళ అనుభవంలో ఆ సంతృప్తి ఒక్కటి చాలంటారా?"... అన్నాను.

"చాలదు! ఒక మంచి సక్సెస్‌ఫుల్ పిక్చర్ ఇవ్వాలనే నా కోరిక. తీరిన నాడే నిజమైన సంతృప్తి! కానీ, ఆ కోరిక ఎప్పుడు తీరుతుందో తెలియక - మంచి డైరెక్టర్‌గా నిలబడాలనే కోరికతో ఎంతమంది కుటుంబాల్ని నాశనం చేసుకోవడం లేదు. ఈ పరిస్థితుల్లో, కనీసం నా కుటుంబాన్ని పోషించుకోగలుగుతున్నారు అనే ఆనందం పొందుతున్నాను. మామూలు మానవుడిగా ఆలోచిస్తే, ఇది మాత్రం సంతృప్తి కాదంటావా?"

నేనేం మాట్లాడలేక బెడ్‌మీద గీతలు గీస్తున్నాను. శంకరంగారు లేచి నిలబడి "చాలా రోజుల తరువాత నా శిష్యుడితో మనస్ఫూర్తిగా మాట్లాడాను. చాలా సంతోషంగా ఉంది రంగబాబూ! ఇక నేను వెడతాను. రేపొకసారి ఇంటికిరా! ఇద్దరం కలిసి ఆఫీసుకు వెడదాం! మనస్టోరీ చెబుతాను! వస్తాను"

"నేనూ రోడ్డు వరకు వస్తాను సార్" అని చెప్పులు వేసుకుని ఆయన వెనకే బయలుదేరాను.

శంకరంగారు టాక్సీలో కూర్చున్న తర్వాత "ఈ వారంలో అడ్వాన్స్ ఇప్పిస్తానన్నారు".

"ఫర్లేదు సార్! దాందేముంది" అన్నాను.

ఆయన చిరునవ్వు నవ్వి, డ్రైవర్‌కి సైగ చేసారు. టాక్సీ కదిలి, ట్రాఫిక్‌లో కలిసిపోయింది.

శంకరంగారి షూటింగ్ మొదలైంది. శంకరంగారితో ఎటువంటి ప్రాబ్లమ్ లేదు. స్టోరీ - డైలాగ్స్‌లో మొత్తం స్క్రిప్ట్ - షూటింగ్‌కు ముందే తయారై రెడీగా ఉంటుంది. రేపటి సీన్లు ఈ రోజే షాట్ డివిజన్ చేసి నా చేతికిస్తారు. సింగిల్ లైన్ ఆర్డరు మూడు కాపీలు తీయించి, తన దగ్గరొకటి పెట్టుకుని, నా కొకటి, అసిస్టెంట్ డైరెక్టర్ కొకటి ఇస్తారు. మర్నాడు తీయబోయే సీన్స్ డైరెక్టర్‌గారి తో డిస్కస్ చేసి, అసిస్టెంట్ డైరెక్టర్‌తో చెప్పగానే, అసిస్టెంట్ డైరెక్టర్ - ఆర్టిస్టుల లిస్టు తయారుచేసి, డ్రెస్ కంటిన్యుటీలు చెక్ చేసి, సెట్ ప్రాపర్టీ లిస్టు రాసి ప్రొడక్షన్, మేకప్, కాస్ట్యూమ్స్, సెట్ అసిస్టెంట్స్‌కి అందజేస్తాడు. మర్నాడు షూటింగు చాలా ప్రశాంతంగా జరిగిపోతుంది. షూటింగ్ బోర్‌గా జరుగుతుందనుకున్న సమయంలో, శంకరంగారు టపీమని ఒక విట్టు వేస్తారు. దాంతో సెట్టంతా పదినిమిషాలు గొల్లుమంటుంది. తర్వాత మళ్ళీ వర్కులోకి జారిపోతాం! నిజంగా 9.00 టు 9.00 కాల్‌షీటు ఇంత త్వరగా అయిపోయిందా అనిపిస్తుంది.

మొదట షెడ్యూల్ ఇన్‌డోర్ చాలా చక్కగా జరిగింది. ఎడిటెడ్ రష్ మూడు రీళ్ళు వచ్చింది. రెండో షెడ్యూల్ అరకులోయ అవుట్‌డోర్! హీరో అనంతకుమార్ కాల్‌షీట్లు మాట్లాడ్డానికి, వాహినీ స్టూడియోకి వెళ్ళాను. షూటింగ్ చాలా జోరుగా జరుగుతోంది. డ్రమెటిక్ సీన్ అనుకుంటాను. అందరూ మూడ్‌లో ఉన్నారు. ఇప్పుడు డిస్టర్బ్ చేయడం కంటే లంచ్ బ్రేక్‌లో మాట్లాడ్డం మంచిది బయటకు రాబోతూ ఆగాను. ఒక మూల నిలబడి, గగన్‌కుమార్ క్లాప్ తుడిచి, అసిస్టెంట్ డైరెక్టర్ చెప్పిన నంబరు క్లాప్ పై రాసి, క్లాప్ అందిస్తున్నాడు. అంతలో అసోసియేట్ డైరెక్టర్ - గగన్‌కుమార్‌తో, "ఏయ్! ఆ మూలేం చేస్తున్నావు. ఆ బల్లలు సెట్‌బాయ్ ఒక్కడూ మోయలేక ఛస్తున్నాడు, సాయి చెయ్యి" అని అరిచాడు.

గగన్ కుమార్ కంగారు పడుతూ బల్ల దగ్గరకెళ్ళాడు. నేను బయటకొచ్చాను. షూటింగ్ లేని ఆర్టిస్టులు కొంత మంది బయట సిగరెట్లు కాలుస్తూ బాతాఖానీ కొడుతున్నారు. నేను రాగానే తెలిసిన ఆర్టిస్టులు విష్ చేసి, మా పిక్చర్లో ఏమన్నా కేరక్టర్లుఇమ్మని అడగటం

మొదలు పెట్టారు. వాళ్ళతో మాట్లాడుతుండగానే లంచ్ బ్రేక్ అనౌన్స్ చేసారు. అనంతకుమార్ ఠీవిగా బయటకొచ్చాడు. మాకు పదిహేనో తేదీనుండీ హీరోయిన్ కాల్‌షీట్లు ఇచ్చింది! హీరోయిన్ కాల్‌షీట్లు ఇచ్చింది - మీరు ఇవ్వండంటే ఇవ్వక పోవచ్చు.

"గుడ్ మార్నింగ్ సర్" అన్నాను.

"గుడ్‌మార్నింగ్!.... ఇలా వచ్చావేంటి రంగబాబూ."

"ఈ నెల్లో అవుడ్‌డోర్ షూటింగ్ పెట్టుకోవాలనుకుంటున్నాం! మీరెప్పుడు ఫ్రీనో కనుక్కొడదామని"

"మీ ప్రొడక్షన్ మేనేజరేమయ్యాడు"

"డైరెక్టరు గారు నన్ను వెళ్ళమన్నారు"

"నా డైరీ సెక్రటరీ దగ్గరుంది! చూసి చెబుతాను మీరు ఎప్పటినుంచీ పెట్టుకోవాలనుకుంటున్నారు"

"మీరెప్పుడంటే అప్పుడే... డైరెక్టరుగారు మాత్రం ఈ నెల పదిహేను నుండీ పెట్టుకుందామని అనుకుంటున్నారు! మీకు వీలైతే..."

"పదిహేను! చూస్తాను. - మీ మేనేజర్నొకసారి నా దగ్గరకు పంపించు"

"అలాగే సార్! వస్తాను"

"ఓ.కె" అని వెళ్ళిపోయాడు.

నేను కారు దగ్గరకొచ్చేసరికి, అక్కడ గగన్‌కుమార్ ఉన్నాడు.

"గుడ్‌మార్నింగ్ సర్" అన్నాడు.

"గుడ్ మార్నింగ్! ఈ పిక్చర్లో అప్రంటీస్‌గా చేస్తున్నారా?"

"అవును సార్"

"ప్రొఫెషన్ తమాషాగా మార్చారే"

"బ్రతకాలిగా సార్! అయినా వేషాలు వెయ్యడం మానలేదు సార్! మీకు వీలైతే చిన్న వేషమైనా, మీ పిక్చర్లో ఇప్పించండి సార్!....

"సరే! ఏమైనా ఉంటే చూసి కబురు చేస్తాను."

"థాంక్యూ సర్!"

"మరి ఉంటాను"

"అలాగే సార్" అన్నాడు.

కారు కదిలింది.

✡✡✡

-తరువాయి భాగం వచ్చే సంచికలో-